Talaaq Kyon Aur Kaise (Telugu)

తలాఖ్

మూలం

డాక్టర్ ముఫ్తీ ముహమ్మద్ ఫహీమ్ అఖ్తర్ నద్వీ

అనువాదం

ఇఖ్బాల్ అహ్మద్

విషయసూచిక

విడాకుల సమస్య	04
విడాకులకు ముందు	05
విడాకులు ఇవ్వకండి	09
ఒకవేళ విభేదాలు కలిగితేనో	11
వేర్పాటు కోసం కేవలం ఒక్క తలాక్	14
మూడు తలాక్‌ల సమస్య	17
మూడు తలాక్‌ల తర్వాత	19
విడాకులు ఎవరికోసం పురుషునికా? లేక స్త్రీకా?	21
ఇద్దత్ (గడువు) గురించి	23

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

విడాకుల సమస్య

మనిషి బ్రతికి ఉండటానికి ఆహారం అవసరం కాని మందు కాదు. ఆహారాన్ని వదలి మందును భోజనపానీయాలుగా చేసుకుంటే మంచి శరీరం కూడా రోగగ్రస్తమవుతుంది. ప్రాణాల మీదికి వస్తుంది. కాని ఆ మనిషే జబ్బుపడితే అప్పుడు ఆరోగ్యం పుంజుకోవడానికి మందు అవసరం అవుతుంది. దాంపత్య జీవితంలో తలాక్ ఈ మందు లాంటిదే. విడాకులు గనక అర్థం చేసుకోకుండా, అవసరం లేకుండా ఇవ్వబడితే ఈ చర్య జీవితాన్ని సర్వనాశనం చేసివేస్తుంది. సంతోషాలకు బదులు ఎన్నోరకాల కష్టాలు చుట్టుముడతాయి. కాని భార్యాభర్తల మధ్య సముద్రపు తీరాలు రెండు కలుసుకోలేని విధంగానే సముద్రపు అవతలి ఒడ్డుకూ ఇవతలి ఒడ్డుకూ ఉన్నంత ఎడం ఏర్పడితే, అప్పుడు ఆ ఇద్దరికీ తలాక్ అవసరం, ప్రతి ఒక్కరికీ సంతోషదాయకం అవుతుంది.

ఈనాడు తలాక్ మన సమాజంలో ఒక ముఖ్యసమస్య అవుతూ పోతోంది. దాని వెనుక తెలియకపోవడం అన్నది ముఖ్య సమస్య. తలాక్ కారణంగా పుట్టుకొస్తున్న సమస్యలకు కంగారు పడి ఒకరు తలాక్‌ను నిషేధించాలని అంటుంటే, మరొకరు దానిని షరతులకు లోబడ చేయాలని వకాలతు చేస్తున్నారు. ఆ హక్కు స్త్రీకి ఇవ్వాలని ఒకరు అంటూ వుంటే, కోర్టుకు ఆ అధికారం అప్పగించాలని మరొకరు అంటారు. మరికొందరు మూడు తలాక్‌లను ఒకటిగా అంగీకరించటమే సమస్యకు పరిష్కారం అంటారు. కొందరి అభిప్రాయంలో మూడు తలాక్‌ల తర్వాత తిరిగి

వివాహం చేయాలన్న తంత్రజ్ఞత వుంది. మొత్తానికి తలాక్ సమస్య విషయంలో ఈనాడు అన్నిరకాల మాటలు, రకరకాల సంభాషణలు విన వస్తున్నాయి. తలాక్ అంటే వాస్తవానికి తెలివిపరులయిన ప్రతి వారూ తమ పన్నాగాలు పన్నదగ్గ వస్తువా? తలాక్ విషయంలో దైవప్రోక్తమయిన షరీఅత్‌లో స్పష్టమయిన బోధనలూ, ఉపదేశాలూ లేవా? సర్వలోక ప్రభువు పంపిన షరీఅత్ చిట్టచివరిదీ, సంపూర్ణమయినదీ. అది విజ్ఞతా వివేకాలతో నిండియున్న ఆద్యంతాలూ మానవులందరికోసం శ్రేయస్కరమైనది షరీఅత్.

ఇస్లామీ షరీఅత్‌లో తలాక్ గురించి సవివరమైన ఉపదేశాలు ఉన్నాయి. ఖుర్ఆన్ మరియు సున్నత్ బోధనల ద్వారా మనం విడాకులు ఎప్పుడు ఇవ్వాలి? అలా ఇచ్చినప్పుడు ఎలా ఇవ్వాలి? అన్నది సులభంగా గ్రహించగలం. రండి. దాన్ని గురించి మనం వివరంగా పరిద్దాం.

విడాకులకు ముందు

అన్నింటికన్నా ముందు ఇస్లామీ షరీఅత్‌లో విడాకులు ఎందుకు సక్రమం? అన్న విషయం గమనిద్దాం. విడాకులు అంటే వివాహాన్ని రద్దు చెయ్యడం అని అందరూ ఎరిగినదే. సాధారణ పరిస్థితులలో వివాహం ప్రతి మనిషికీ అవసరమే. ఇది ఇస్లాం ప్రవక్త ముహమ్మద్(స) సున్నత్ (సంప్రదాయం) కూడాను. మనిషికి కొత్త కుటుంబం ఉనికిలోకి వచ్చేది వివాహం ద్వారానే. మానవ జాతి పరంపర కొనసాగించబడేది ఈవిధంగానే, వివాహం ఒక ఆరాధన కూడాను. దీని ద్వారానే ధర్మబద్ధ పద్ధతిలో లైంగిక వాంఛలు తీర్చుకోబడతాయి. అధర్మ, అక్రమ లైంగిక వాంఛల నుండి రక్షణ లభిస్తుంది. ఇటువంటి సుగుణాలూ, విజ్ఞతలతో కూడిన వివాహబంధం ఎంతో దృఢంగా ఉండాలి. ఎందుకంటే ఈ సంబంధం ఎంత దృఢంగా ఉంటే, వివాహం వలన కలిగే ఫలితాలూ అంతే ఉత్తమంగా శ్రేష్టంగా ఉంటాయి. ఇస్లాం వివాహబంధాన్ని పరిపూర్ణమయిన ఒడంబడిక మరియు

వాగ్దానంగా నిర్ణయించింది. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిస్తున్నాడు:

"ఇంకా ఆ భార్యలు మీనుండి గట్టి వాగ్దానం తీసుకుని వున్నారు"

దివ్యఖుర్‌ఆన్ ప్రకారం వివాహం గట్టి వాగ్దానం. ఎంతో పరిపూర్ణ మైన ఒడంబడిక. దైవప్రవక్త(స) ఒక సహాబీతో, "వివాహం కోసం ఒక సంబంధం వచ్చింది. పోయి ఆ మహిళను చూసుకో" అని ఆజ్ఞాపించారు. అందుకు కారణం ఇలా సెలవిచ్చారు.

"ఈ విధంగా మీ ఇద్దరి మధ్య శాశ్వత సంబంధం ఏర్పడగలదు"

(తిర్మిజీ, కితాబున్నికాహ్, హదీసు నం. 1087)

కనుక వివాహబంధం శాశ్వతం, దృఢతరం చేసే ప్రయత్నం నికాహ్‌కు ముందు కూడా జరగాలి. నికాహ్ తర్వాత కూడాను.

వివాహం తర్వాత ఈ బంధాన్ని దృఢతరం చెయ్యడానికి దైవ ప్రవక్త(స) రెండు రకాల విషయాలను అవలంబించమని ఆదేశించారు. మొదట భార్యాభర్తలిద్దరి హక్కులు మరియు ఇద్దరి బాధ్యతలు నిర్ణయిం చబడాలి. తమ తమ విధులు, బాధ్యతల్ని నెరవేర్చాలని ఇద్దరికీ చెప్పారు. భర్త తన బాధ్యత పూర్తిచేసినట్లయితే భార్యకు హక్కులు లభిస్తాయి. భార్య తన బాధ్యత పూర్తిచేసినట్లయితే భర్తకు హక్కులు లభిస్తాయి. దైవప్రవక్త(స) "నీవు తినేదాన్నే నీ భార్యకూ తినిపించు; నీవు ధరించేదే నీ భార్యకూ ధరింపచెయ్యి. భార్యను తిట్లు తిట్టవద్దు" అని భర్తతో అన్నారు.

ఇంకా "నీవు భర్త చెప్పినట్లు విను. అతని ఇంట్లో అతని ప్రక్కమీద భర్తకు ఇష్టంలేని వారిని రానీయకు" అని భార్యకు చెప్పారు. *(తిర్మిజీ షరీఫ్, కితాబుర్రజా 1163, అబూదావూద్, హదీసు నం. 1830)*

రెండవది, జీవన పయనంలో మిట్టపల్లాలు ఎదురవుతూ ఉంటాయి. సంతోషంలోనూ, కోపంలోనూ ఇద్దరూ ఒకరి మనస్తత్వాన్ని మరొకరు గ్రహించాలి. పరస్పరం న్యాయం, సమతూకం పాటించడం మరువకూడదు. దైవప్రవక్త(స) పురుషునితో సెలవిచ్చారు:

"విశ్వాసి అయిన ఏ భర్తా, తన భార్యను ద్వేషించరాదు" ఒకవేళ అతడికి భార్య మాట ఒకటి సహించరానిదిగా తోచినట్లయితే మరొకటి మంచి మాటగా కూడా అనిపించవచ్చు"

ఎంతటి విజ్ఞతతో కూడిన మానసిక మార్గదర్శకత్వం ఇది! ఎటువంటి మాట అంటే ప్రతి మనిషికీ ఇది అనుభవంలోకి వచ్చేదే. ఒక విషయంలో లోపం వుండి ఎన్నో ఇతర సుగుణాలు లేని వారెవరు ఉన్నారని! ఏదయినా అసహనం, ఆగ్రహం కలిగిన వేళ ఎప్పుడు ఈ అంశం ఎదుటికి వచ్చినా తమను తాము కంట్రోలు చేసుకోవడం, కోపానికి కట్టలు వెయ్యడం సులభం అయిపోతుంది. భర్తనే ఉద్దేశించి దివ్యఖుర్‌ఆన్ అంటోంది:

"ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టి ఉండవచ్చు."

(అన్‌నిసా: 19)

ఇంకా భార్యను సంబోధించి, ఆయన (స)పలికారు: "నేను గనక ఒకరిని ఏ మనిషికైనా సజ్దా చెయ్యమని ఆదేశించేవాడ్నయితే తన భర్తకు సజ్దా చెయ్యమని భార్యకు ఆదేశించే వాడినే."

(తిర్మిజీ, కితాబున్నికాహ్, హదీసు నం. 1159)

ఈ రెండు విషయాలనూ అవలంబించి భార్యాభర్తలు ఒకరికొకరు సహచరులైపోతారు. గాని ప్రత్యర్థులవరు. ఇద్దరు ఒకరి భాగం మరొకరు అయిపోతారు తప్ప చెరో పార్టీ అవరు. ఒకరి గురించి మరొకరికి కలిగే ఈ భావన సగానికి పైగా సమస్యల్ని కూకటివేళ్ళతో పెకలించి పారవేస్తుంది. ఇటువంటి అనుభూతి కలిగి ఉంటూ, ఒకవేళ ఎవరిదయినా, ఏదయినా లోపం ఎప్పుడయినా సంభవించినప్పుడు, ఏదయినా పని పూర్తి కానప్పుడు అందుకు కోపం వచ్చే బదులు వారి పట్ల సానుభూతి జనిస్తుంది. వారిని ఎత్తిపొడిచే బదులు వారికి నచ్చచెప్పే స్ఫూర్తి కలుగుతుంది. వారిపై

ప్రతీకారం తీర్చుకునే ఆలోచనకు బదులు వారిని సంస్కరించాలన్న భావన కలుగుతుంది. ఇక ఒకవైపు నుండి ఇటువంటి భావం, వ్యవహరణ ప్రకటించబడినప్పుడు ఎదుటివారి వైపునుండి కూడా తమ లోపానికి సిగ్గుపడి ఎదుటివారిపై ప్రేమా గౌరవాలు పెరుగుతాయి. ఒకరిపై మరొకరికి ద్వేషం, దూరం వారిలో చోటు చేసుకోవు. అది ఎలా సంభవం? ఇద్దరూ ఒకరి భాగం మరొకరు అయినప్పుడు ఇద్దరూ కలిస్తేనే పరిపూర్ణత సిద్ధించినప్పుడు తన భాగంతోనే ఎవరయినా అపరిచితులన్న భావన కలుగుతుందా? చూడండి. దివ్యఖుర్ఆన్ ఎంతటి విజ్ఞతతో కూడిన మాటల్లో దీనిని వివరిస్తోందో గమనించండి:

"మీరు పరస్పరం ఒకరికి భాగం మరొకరు." ***(అలి ఇమ్రాన్: 195)***

దివ్యఖుర్ఆన్ ఈ స్థితిని చతుర ధోరణిలో ప్రకటిస్తోంది:

"భార్యలు మీకు దుస్తులు. మీరు భార్యలకు దుస్తులు"

(అల్ బఖర:187)

దైవప్రవక్త(స) ఈ ద్విముఖ సంబంధాన్ని తెలియచేస్తూ సెల విచ్చారు:

"స్త్రీలు పురుషుల భాగం" *(అబూదావూద్, కితాబుత్తహారహ్: హదీసు నం. 236)*

భార్యాభర్తల అనుబంధం గురించిన భావన దృష్టిలో లేనప్పుడు చిన్నచిన్న విషయాలు అకారణంగా సమస్యలవసాగుతాయి. ఎదుటివారి లోపం, లేమి పట్ల అనవసరమయిన శంకా దృష్టితో చూడడం జరుగుతుంది. మాట మాటకు కట్టడి జరుగుతుంది. దాంతో ఒకరి తరఫునుండి ఎత్తిపొడుపులు అనుమానాలు, ఎదుటి వారిలో కూడా ఆగ్రహం, ప్రతీకారేచ్ఛ చెలరేగుతుంది. దాంతో ఆవగింజ కాస్తా పర్వతం అయిపోతుంది. నిప్పురవ్వ కాస్తా అగ్నిజ్వాల అయిపోతుంది. దాంతో ఇల్లు మొత్తం

మండనారంభిస్తుంది. నిప్పు నిప్పే కదా! అంటుకుందంటే మండుతూ పోతుంది. భార్యాభర్తలే కాక ఇద్దరి కుటుంబాలు మాడిపోతాయి. అన్నింటి కన్నా పెద్దనష్టం పిల్లలకు కలుగుతుంది. ఒకరినొకరు తమ భాగస్వామిగా, భాగంగా భావించనప్పుడు ప్రత్యర్థి లేక పార్టీ అయిపోతారు. ఇక నిత్యం సంఘర్షణ మొదలవుతుంది. తమ బాధ్యత నెరవేర్చవలసిన చోట తమ హక్కులను కోరటం ఆరంభమవుతుంది. ఈ అపక్రమ ధోరణి, వ్యతిరేక భావనే జీవితనౌకను వెనక్కి నడిపిస్తుంది. కేవలం భావనను సక్రమం చేసుకోవాలి. అపక్రమ ధోరణిని సక్రమ ధోరణిగా మార్చుకోవాలి. అదేచోట వుంటూ ఇద్దరూ ఒకరినొకరు శ్రేయోభిలాషులుగా అయిపోతారు. తమ సమస్యల్ని సామరస్యంతో పరిష్కరించుకుంటారు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు:

"చూడండి! స్త్రీల పట్ల సక్రమ వ్యవహరణ గురించిన ఉపదేశాన్ని స్వీకరించండి. వారు మీ కోసం కేవలం సహాయకులు మాత్రమే"

(తిర్మిజీ, కితాబుల్ వజా, హదీసు నం. 1163)

విడాకులు ఇవ్వకండి

వివాహబంధం ఇలా పటిష్టం అయినప్పుడు దాన్ని తెంచుకోవలసిన అవసరం కలుగదు. వివాహం గురించిన ఇస్లామీయ భావన ఇదే. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త(స) కోరేది ఇదే. అందుచేత దైవప్రవక్త(స) విడాకుల నుండి సాధ్యమయినంతవరకు ఆపారు. ఇంకా విడాకుల అరిష్టాన్ని, చెడుగును రకరకాలుగా వివరించారు. భార్యను మార్చుకోవటానికి విడాకులివ్వడాన్ని ఇస్లాం బోధించదు. లైంగికవాంఛ గనుక మిక్కుటంగా వుంటే జాయిజ్ (ధర్మబద్ధ) పద్ధతుల ద్వారా దాన్ని తీర్చుకునే అనుమతి ఇవ్వబడింది. న్యాయం, స్తోమతలతో మరికొందరు భార్యల్ని చేసుకోవడానికి తలుపు తెరిచింది. కాని కాంక్షను మార్చిమార్చి తీర్చుకోవడానికి దుస్తులు, బూట్లలాగా భార్యను మార్చడం పరమ నికృష్ట విధానం.

ఇవే తప్పుడు కోరికలు ఉద్రేకాలు గనకు భార్యలో ఉంటే, ధర్మబద్ధమయిన కారణం లేకుండానే ఆమె భర్త నుండి విడాకులు కోరినట్లయితే అల్లాహ్ తరఫున కఠినాతి కఠినశిక్షకు ఆమె యోగ్యురాల వుతుంది. హదీసులో దీనిగురించి ఏమి చెప్పబడిందో గమనించండి.

"తగిన కారణంలేకుండా తన భర్త నుండి విడాకులు కోరిన స్త్రీకు స్వర్గసువాసన హరాం అయిపోతుంది.

(అబూదావూద్, కితాబుత్తలాఖ్, హదీసు నం. 1899)

విడాకులు మామూలు విషయాలు, చిరుకోపాల కారణంగా ఇచ్చే వస్తువు కాదు. ఏవిధంగా నికాహ్ సందర్భంలో రెండు మాటలు పలికి అపరిచిత స్త్రీ, పురుషులు కుటుంబంలోని మరే ఇతర బంధుత్వం కన్నా అత్యంత చేరు అయిపోతారో ఆ రెండు మాటలే బంధుత్వపు దృఢబంధం ఏర్పరుస్తాయి. అదేవిధంగా రెండు మాటలతో పటిష్టమైన బంధం తెగిపోతుంది. ఆ రెండుమాటల నుండి తప్పించుకోమని గట్టిగా అజ్ఞాపించబడింది. ఈ మాటలు మరియు పదాలు అతి ముఖ్యమైనవి. తేలికపాటి విషయాలకు, సాధారణ స్పర్ధలకు ఈ పదాల్ని ఉపయోగించడం అంటే విషాన్ని సేవించటమే. జాగ్రత్త! చిన్నమాట కోసం ఇంత భయానక తప్పిదం చేసేయడమేనా? దైవప్రవక్త(స) సెలవిచ్చారు:

"మూడు విషయాలలో సౌమనస్యం, పరిహాసం రెండూ సమానం. నికాహ్, తలాక్, తిరిగి నికాహ్ చేసుకోవడం.

(తిర్మిజీ, కితాబుత్తలాఖ్, హదీసు. నం. 1184)

అంటే మూడు విషయాల్ని బాగా ఆలోచించి, అర్థం చేసుకొని చెప్పడం ద్వారా ఏ విధంగా పరిణమిస్తాయో పరిహాసానికి ఈ మూడు పదాల్ని వినియోగిస్తే అప్పుడు కూడా అదేవిధంగా ఇవి పరిణమిస్తాయి. నిజానికి ఈ మూడు విషయాల ప్రాధాన్యత కారణంగా వాటిని పరిహాసానికి వాడుకోవడాన్ని ఇస్లాం నిరోధించ గోరింది. కనుక ఇటువంటి నాజూకు

మరియు కఠినప్రభావం గల పదాలు ఇట్టే నాలుకపైకి రావడం, మామూలు విషయాలకు వీటిని ఉపయోగించడం అల్లాహ్‌కు అత్యంత అయిష్టకరం మరియు పెద్దనేరం. ఇటువంటి నేరం నుండి తప్పించుకోండి. అకారణంగా అనవసరంగా విడాకులు ఇవ్వకండి. ప్రపంచంలోని అతిచెడ్డ వస్తువు ఏదీ అని అడగబడినప్పుడు దాని జవాబు విడాకులు. ఈ జవాబు ప్రపంచంలోనే గొప్ప సత్యవంతులైన అందరికన్నా గొప్ప ప్రవక్త అయిన ముహమ్మద్(స)ఇచ్చారు. ఆయన సెలవిచ్చారు:

"అల్లాహ్ వద్ద హలాల్ వస్తువులలోకెల్లా అత్యంత అసహ్యకరమైన, అయిష్టకరమైనది విడాకులే."

మరే ఇతర జాయిజ్ మరియు హలాల్ పని ఇంతకన్నా ఎక్కువ చెడ్డపని కాదు. తలాఖ్ ఇంత చెడ్డపని కావడానికి కారణం, దాని ప్రభావం ఒక్కరిపైనే పడదు. లేక విడాకుల ప్రభావానికి ఇద్దరు వ్యక్తులే కాదు, దానివలన కుటుంబ విచ్ఛిత్తి కలుగుతుంది. ఆ తర్వాత ఇరు కుటుంబాల వరకూ ద్వేషం శత్రుత్వం ప్రాకుతుంది. కొత్తగా ఉనికిలోవచ్చే జాతి పునాది కదలిపోతుంది. క్రమంగా యావత్ సమాజంలో కలతలు, చీలికలు సంభవిస్తాయి. ఇంతటి దీర్ఘకాలిక ప్రభావాలు విడాకులు వలన కలుగుతాయి. కనుకనే విడాకులు అన్నింటికన్నా చెడు వస్తువు.

ఒకవేళ విభేదం కలిగితేనో?

భార్యాభర్తలిద్దరూ తమ బాధ్యతల పట్ల స్పృహ కలిగి, చింత కలిగి ఉన్నప్పటికీ పరస్పర విభేదాలు తలెత్తడం సాధ్యమే. అటువంటప్పుడు ఏంచెయ్యాలి? కోపంతో విడాకులు ఇచ్చేయాలా? లేదు. ఎంతమాత్రం కూడదు. విడాకుల వంటి ముఖ్యవిషయంలో కోపంతో నిర్ణయం తీసుకో కూడదు. విభేదం తలెత్తితే అటువంటి సందర్భంలో కొన్ని ముఖ్య విషయాలను గమనించండి.

★ విభేదానికి కారణం ఏమిటి? మీపై ఏదయినా జాయిజ్ (ధర్మ బద్ధ) ఆరోపణ ఏదయినా వుందా? ఒకవేళ వుంటే దాన్ని దూరం చెయ్యండి. ఒకవేళ మీరేదైనా హక్కును నెరవేర్చలేక పోతున్నట్లయితే దాన్ని పూర్తి చెయ్యండి. మీలోపాన్ని సరిచేసుకోండి. విభేదం దానంతట అదే సమసి పోతుంది.

★ మీరిద్దరూ కలసి కూర్చుని చల్లని మనసుతో పరిస్థితులను సమీక్షించండి. ఒకరికొకరు నచ్చచెప్పుకోండి. తెలుసుకోవడం, తెలియ జెప్పడం ద్వారా విభేదం తొలగిపోతుంది.

★ కుటుంబ శ్రేయోభిలాషినెవరినయినా మధ్యన పెట్టుకోండి. ఆయన మీ ఇద్దరు చెప్పినదీ విని ఇద్దరికీ నచ్చజెప్పి ఆరోపణను అంతం చెయ్యాలి. ఎవరిలో లోపం వుంటే వారిని బద్ధులు చెయ్యండి. ఇది గెలుపూ ఓటముల సమస్య కాదు. మీ జీవితాన్నే సుహృద్భావ పూరితం చేసుకునే సమస్య. కనుక మీ లోపాన్ని వెంటనే అంగీకరించండి. దాన్ని తొలగించు కోండి.

★ ఒకవేళ విభేదం అంతకన్నా మరింత తీవ్రమయినదయితే మీ ఇద్దరి కుటుంబాల నుండీ ఒక్కొక్క మధ్యవర్తిని నిర్ణయించుకోండి. కుటుం బంలోని వారయితే వారు ఇంటి విషయాలు ఎరిగినవారయి ఉంటారు. చక్కగా విచారణా చేయగలుగుతారు. ఈ మధ్యవర్తులిద్దరూ చిత్తశుద్ధి కలవారూ కావాలి. శ్రేయోభిలాష కలిగిన వారూ కావాలి. వీరిద్దరి అసలు లక్ష్యం విభేదాన్ని అంతం చేసి భార్యాభర్తల్ని కలిపేదయి వుండాలి. ఇద్దరు మధ్యవర్తులూ పూర్తి విశ్వసనీయతతో, న్యాయదృష్టితో విభేదాన్ని సమీక్షిం చాలి. ఇద్దరికోసమూ నిబంధన ఏర్పరచాలి. ఏ విషయాలవల్లనయితే విభేదం తలెత్తిందో ఆ విషయాన్ని కట్టడి అయినా చెయ్యాలి. లేదా వాటి హద్దుల్ని నిర్ణయించాలి.

★ కొన్ని సందర్భాలలోనయితే విభేదానికి మూలకారణం భార్యాభర్తలు కాక మూడోవ్యక్తి ఎవరో అయివుంటారు. భార్యాభర్తలలో ప్రేమానురాగాలు, శ్రేయోభిలాష వుంటాయి. కాని కొన్ని సందర్భాలలో ఉమ్మడి కుటుంబంలోని ఒకరు అక్కడి మాట ఇక్కడ చెప్పో లేక లేనిపోని మాటలు కల్పించో లేక భార్యాభర్తలలో ఒకరిని తన చెప్పుచేతలలో ఉంచుకోవాలనే ఉద్దేశ్యంతోనో వారిపై ఒత్తిడిచేసి ఇద్దరి మధ్యా తలవంపులు పెడతారు. ఒకసారి వాడకట్టు (మొహల్లా)లోనో, పొరుగులోనో ఉండే స్త్రీగానీ, పురుషుడుగానీ భర్తను భార్యకు వ్యతిరేకంగా, లేక భార్యను భర్తకు వ్యతిరేకంగా రెచ్చగొడతారు. అటువంటప్పుడు భార్యాభర్తలిద్దరూ తమ శ్రేయస్సు కోసం ఆ కీడు తలపెట్టేవారి మాటల్ని పట్టించుకోకూడదు. అంతేకాక మా విషయాల్ని మేమే పరిష్కరించుకోగలం అని వారిని పూర్తిగా వారించాలి. ఇటువంటి పని ఇంటిలోని వ్యక్తే ఎవరయినా చేస్తుంటే, భార్యాభర్తలిద్దరూ వారి వ్యవహారంలో ఇతరుల జోక్యానికి తావులేని వాతావరణం కల్పించుకోవాలి. అవసరం అయితే తమ నివాసాన్ని మరోచోటికి మార్చుకోవాలి. ఎందుకంటే వాతావరణం మారినందువల్ల కూడా పాత వాతావరణం నుండి సంభవించే విభేదం అంతమవుతుంది. విభేదాన్ని దూరం చెయ్యడం ఒక విశ్వాసి ఘనత. అల్లాహ్ ఆదేశమూ ఇదే. ఇతర అపకారబుద్ధి గలవారు తగవులు పెట్టి తమాషా చూస్తుంటారు. ఇందువల్లనే దివ్యఖుర్ఆన్ పురుషునికి ఉపదేశపూర్వకమయిన ఆదేశమిస్తూ అంటోంది:

"భార్యల పట్ల సద్భావంతో మెలగండి" *(అన్ నిసా: 19)*

మీరు గనక విభేదాన్ని అంతం చేయ ప్రయత్నిస్తే అల్లాహ్ మీ మధ్య అనుసంధానం కలిగిస్తానని దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ వాగ్దానం చేశాడు: దైవోపదేశాన్ని గమనించండి:

"భార్యాభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయనే భయం మీకు కలిగితే, భర్త బంధువుల నుండి ఒక మధ్యవర్తిని, భార్య బంధువుల

నుండి ఒక మధ్యవర్తినీ నియమించండి. వారిద్దరూ సంస్కరణను కోరితే అల్లాహ్ వారి మధ్య సయోధ్య (అనుకూలత) కుదరడానికి మార్గం చూపుతాడు." ***(అన్నిసా: 35)***

ఎంతమంచి ఫార్ములా ఇది! ఎన్ని భగ్నహృదయాలను అల్లాహ్ కలిపివేస్తాడు. విభేదం ఏర్పడితే ఈ ఖుర్ఆన్ ఫార్ములాను అవలంబించండి. ఇన్షాఅల్లాహ్ (దైవచిత్తం అయితే) సుఖసంతోషాలు తిరిగి వెల్లివిరుస్తాయి. పైగా ప్రేమానురాగాలు మునుపటికన్నా మెరుగు పడతాయి.

వేర్పాటు కోసం కేవలం ఒక్క తలాక్

జీవితంలో మిట్టపల్లాలు ఎదురవుతూనే ఉంటాయన్నది అందరూ ఎరిగినదే. ఒకరిపట్ల మరొకరికి ఆరోపణ ఒక్కోసారి వుంటుంది. ఒక్కోసారి కష్టమూ కలుగుతుంది. ఈ విషయాలు జీవితంలో తప్పనిసరిగా అనుభవం లోకి వచ్చేవే. ఇటువంటి విషయాలు చోటుచేసుకోని జీవితాలు బహు అరుదు. ఇలాంటి సంఘటనలు జీవితంలో వస్తూపోతూ వుంటాయి. ఇవాళ వున్న షికాయతు రేపు అంతం అవుతుంది. తాత్కాలిక ఇబ్బందులు తొలగి పోతుంటాయి. ఆర్థిక ఇబ్బందులు వుంటే సమష్టిగా కృషి చేస్తే అల్లాహ్ విరివిగా ప్రసాదిస్తాడు. ఇటువంటి విషయాల కారణంగా వేర్పాటు జరుగదు. ఇలా ఆలోచించనూకూడదు. కాబట్టి ఇటువంటి ఏ విషయం లోను కోపంతో తలాఖ్ పదాన్ని నాలుకమీదికి రానీయకండి. తలాఖ్ అంటే ఏమిటో బాగా గ్రహించండి.

వివాహం ఇద్దరు అపరిచితుల్ని కలిపినట్లే తలాఖ్ (విడాకులు) వివాహాన్ని రద్దు చేస్తుంది. అందువల్ల వివాహాన్ని రద్దు చేసుకోవలసిన అవసరం ఏర్పడినప్పుడే విడాకులు అవసరం అవుతాయి. వివాహం కోసం నెలల తరబడి సంప్రదింపులూ, పెళ్ళిచూపులూ జరుగుతాయి. కుటుంబ పెద్దలతో మిత్రులూ శ్రేయోభిలాషులతో సలహాలు తీసుకోబడతాయి. అన్నిరకాలుగా సంతృప్తి పొందడం జరుగుతుంది. తర్వాత అన్ని ఏర్పాట్లతో

పెద్దల సమక్షంలో వివాహ కార్యక్రమం పూర్తవుతుంది. సరిగ్గా అదేవిధంగా వివాహాన్ని రద్దుచేసుకునే ప్రసక్తి వచ్చినప్పుడు అందుకు అన్నికోణాల నుండి మాటామంతీ జరుగుతాయి. కుటుంబ పెద్దలూ, హితైషులతో సలహా సంప్రదింపులు జరుగుతాయి. మతపెద్దలు ఉలమాల నుండి అందుకు సంబంధించిన షరీఅత్ మార్గదర్శకత్వాన్ని పొందటం జరుగుతుంది. ఇక వీటిన్నటిని తర్వాత వివాహం రద్దు చేయడమే అవసరం. పూర్తి సంతృప్తి కలిగినప్పుడు ఇక అదే అల్లాహ్ ఆదేశం. అప్పుడు పెద్దల సమక్షంలో వివాహం రద్దుచేసుకునే కార్యక్రమం జరగాలి. దాని పేరే తలాక్.

దివ్యఖుర్‌ఆన్ ముక్తసరి పదాలలో ఈ విషయాన్ని ఇలా చెప్పింది:

"భార్యను సక్రమంగా ఉండనివ్వాలి. లేదా ఆమెను సహృదయంతో సాగనంపాలి" ***(అన్‌నిసా : 229)***

అంటే వివాహం లక్ష్యం సక్రమంగా సహజీవనం చెయ్యాలి. అది అసాధ్యంగా పరిణమించినప్పడు అభిప్రాయభేదాల్ని తొలగించే, సంప్రదింపులు జరిపే అన్ని దశలను దాటిన తరువాత ఇక వేరుపడటమే ఆ భార్యాభర్తలకు శ్రేయస్కరం అన్న నిర్ణయానికి వచ్చినప్పుడు వేర్పాటు ప్రక్రియ అవలంబించ బడుతుంది. దివ్యఖుర్‌ఆన్ ఇటువంటి అవకాశం కోసమే వేర్పాటును సక్రమమయినదిగా చెపుతుంది. ఖుర్‌ఆన్ అంటోంది! భార్యాభర్తలిరువురికీ తాము సుహృద్భావ జీవితం గడపలేమన్న అవగాహన కలిగితే ఒండొరుల హక్కుల్ని, దాంపత్య జీవితం కోసం అల్లాహ్ ఇచ్చిన ఆదేశాలను పూర్తి చేయలేమన్న నిర్ధారణకు వస్తే ఇక ఇద్దరూ వేరయి పోవాలి.

"అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేమనే భయం మీకు కలిగితే, స్త్రీ తన భర్తకు ఏదయినా పరిహారం ఇచ్చి వేరుకావటాన్ని వారిద్దరూ అంగీకరిస్తే అందులో ఏమాత్రం దోషం లేదు. ఇవి అల్లాహ్ నిర్ణయించిన హద్దులు వీటిని అతిక్రమించకండి. ***(అల్ బఖర: 229)***

కనుక ఈ దశకు చేరుకున్న తర్వాత విడాకుల ప్రక్రియ నిర్వహించ బడితే అందుకు పాటించవలసిన విధానం ఇలా వుంటుంది.

మీరు భార్యకు మహర్‌ను ఇచ్చివుండకపోతే అ మహర్ ధనాన్ని చెల్లించి వేయండి.

ఆ దినాలలో భార్య ఎటువంటి స్థితిలో వుందో చూసుకోండి. ఒకవేళ ఆమె బహిష్టు దినాలు గడుపుతూ వుంటే ఇంకా వేచి, ఆమె పవిత్ర అయ్యే దినం రాకకోసం ఎదురుచూడండి. పవిత్ర స్థితి గల దినాలలో మీరు భార్యతో శారీరక సంబంధం పెట్టుకోండి.

ఇక ఇప్పుడు మీరు ఇద్దరు పెద్దల సమక్షంలో కేవలం ఒక్కసారి తలాఖ్ ఇవ్వండి. నోటితో చెప్పడం లేదా "నేను విడాకులు ఇస్తున్నాను" అనిమాత్రం రాసిఇచ్చినా చాలు. తలాక్ అయిపోతుంది. ఈ పదాన్ని పునరుక్తం చెయ్యకండి. తలాఖ్ పదాల్ని రెండోసారి పలక్కండి. తలాఖ్ పదాన్ని పునరుక్తం చెయ్యడం లేదా మూడు సార్లు పలకడం లేదా రాయడం గొప్ప అజ్ఞానం, పూర్తిగా తప్పు. ఇలాంటి తప్పు ఎప్పుడూ చెయ్యకండి. ఇది ఎంత పెద్ద తప్పో మీకు తెలుసు. ఎంతపెద్ద తప్పు అంటే, దైవప్రవక్త(స)కు ఒకరు ఈ తప్పుచేశారని తలాక్ మూడుసార్లు ఇచ్చారని తెలిసినప్పుడు అంతులేని దయార్థహృదయుడయిన ప్రవక్త(స) వదనం కోపంతో ఎర్రబడింది. ఎంతో ఆగ్రహించారు. కఠినంగా ఇలా పలికారు:

"నేను ఉండగానే దైవగ్రంథం (ఖుర్ఆన్)ను మీరు ఆటవస్తువుగా చేసుకున్నారా?" *(నసాయి, కితాబుత్తలాఖ్: 3430)*

ఆ ఉగ్ర పరిస్థితిని, ఆ వాక్యంలోని కరకుదనాన్ని చూడండి. ఒకసారి కన్నా ఎక్కువ తలాఖ్‌లు ఇవ్వడం ఎంతపెద్ద నేరమో, ఎటువంటి భయం కర తప్పిదమో అంచనా వెయ్యండి. కొందరు తెలియనివారు ఇటువంటి సందర్భాలలో తలాక్ మూడుసార్లు రాయిస్తారు లేక చెప్పిస్తారు. వీరికి షరీఅత్ సమస్య సరిగ్గా తెలియదు. ఏదైనా దస్తావేజు కాగితంపై తలాక్

వ్రాయవలసిన అవసరం వచ్చినప్పుడు అక్కడ కూడా కేవలం ఒక్కసారి రాయండి. వేరుపడటానికి కేవలం ఒక తలాక్ చాలని గుర్తుంచుకోండి.

ఒక తలాక్ ఇచ్చిన తర్వాత తలాక్ అయిపోతుంది. అప్పటి నుండే ఇద్దత్ (గడువు) ప్రారంభమయిపోతుంది. మూడు బహిష్టులు లేక మూడు నెలల ఇద్దత్ గడిచిన తరువాత స్త్రీ పురుషులిద్దరి సంబంధాలు పూర్తిగా అంతం అవుతాయి. ఇద్దత్ దినాలలో భార్యకు భోజన పానీయాలు, వసతి కల్పించడం భర్త బాధ్యత. భార్య భర్త ఇంట్లోనే వుండి ఆ ఇద్దత్ కాలం పూర్తి చెయ్యాలి. ఇద్దత్ మూడు నెలల కాలం మధ్యలో వేరుగా వుండి జీవిస్తూ తమ వెనుకటి నిర్ణయానికి చింతిస్తూ మరెవరినయినా వివాహం చేసుకునే బదులు ఆ భార్యతో బంధుత్వం ఏర్పరచుకోవాలన్న అభిప్రాయం కలగటం ఒక్కోసారి సంభవిస్తుంది. అటువంటప్పుడు కేవలం తిరిగి చేరువ అయితే సరిపోతుంది. తిరిగి చేరువ కావడానికి భార్యతో భర్త "నేను నిన్ను తిరిగి భార్యగా చేసుకుంటున్నాను" అని చెప్పితే సరిపోతుంది. లేదా ఆమెతో భార్యపట్ల వ్యవహరించినట్లుగా ఏదయినా చేయాలి. తిరిగి స్వీకరించే విషయం కూడా పెద్దల సమక్షంలో జరగటం ఉత్తమం. తిరిగి స్వీకరించిన తరువాత కొత్త బంధుత్వం (సంబంధం) ఆరంభమవుతుంది. ఒకవేళ ఇద్దత్ మూడు మాసాలు గడిచిపోయి ఆ తర్వాత ఎప్పుడయినా ఇలాంటి ఉద్దేశం కలిగినట్లయితే ఇప్పుడు రెండవసారి కొత్తగా మహర్ చెల్లించి వివాహ కార్యక్రమం నిర్వహించాలి. నికాహ్ తర్వాత వారు తిరిగి దంపతులు అవుతారు. ఒకసారి మాత్రమే తలాఖ్ ఇవ్వడం వలన భవిష్యత్తులోఇలాంటి అవకాశాల మార్గం తెరవబడి వుండగలదు. ఇటువంటి అవకాశాల ఉద్దేశ్యం లేకపోయిన్పటికీ వేర్పాటు కేవలం ఒక్క తలాక్‌తో పూర్తి అయి పోతుంది.

మూడు తలాక్‌ల సమస్య

మూడు తలాక్‌ల సమస్యపై ఈనాడు ఎంతో చర్చ జరుగుతోంది.

జనం రకరకాలుగా చెప్పుకు తిరుగుతుంటారు. మొదట ఈ విషయం బాగా గుర్తుంచుకోండి. మూడు తలాక్‌లు ఇవ్వడం పాపం. వెనుకటి విషయాల్ని మీరు గనక చదివివుంటే మూడు విడాకుల అవసరం కూడా లేదని మీరు పూర్తిగా గ్రహించివుంటారు. విడాకులు అనేది బాగా ఆలోచించి సలహాలు పొందిన తర్వాత చేయవలసిన పని. కేవలం ఒక్క తలాక్‌తోనే వేరుపడటం (Separation) పూర్తి అవుతుంది.

ఎవరయినా గనుక వేరుపడటానికి ఒక్క తలాక్ ఇచ్చే, పైన చెప్ప బడిన పద్ధతిని అవలంబించకపోయినట్లయితే, మూడు తలాక్‌లు ఇచ్చేస్తే, ఈ సందర్భంగా కొన్ని విషయాలు అర్థం చేసుకోండి.

ఒక్కసారిగా మూడు తలాక్‌లు ఇవ్వటం పాపం, ధర్మవిరుద్ధం. ఇలా చేసే వాడు పాపిష్టివాడు మరియు దైవప్రవక్త(స) ఆగ్రహానికి అర్హుడవుతాడు. ఎవరయినా ముస్లిం ఒక్కసారిగా మూడు తలాక్‌లు కేవలం తలాక్ పదం లేక వాక్యాన్ని పునరుచ్ఛరించి అంటే తలాక్, తలాక్, తలాక్ లేదా తలాక్ యిస్తున్నాను, తలాక్ యిస్తున్నాను, తలాక్ ఇస్తున్నాను అని పలికి తలాక్ యిచ్చినట్లయితే లెక్క మరియు సంఖ్య పలకలేదు అంటే నీకు మూడు తలాక్‌లు ఇస్తున్నాను" వంటి వాక్యాలు పలకలేదు. తలాక్ ఇచ్చేవాడు పదాలను పునరుచ్ఛరించడం నా ఉద్దేశ్యం కేవలం తకరారు మరియు తాకీదు మాత్రమే అని అంటే హనఫీ మస్లక్‌లో దానిని ఒక తలాక్‌గా పరిగణిస్తారు.

మొత్తమ్మీద తలాక్ ఒకటిగా పరిగణింపబడినా లేక మూడుగా అయినా ఒక విషయం మాత్రం నిర్ణీతమే. అంటే మూడు తలాక్‌ల అవసరమేలేదు. అలా చేయడం సక్రమమూ కాదు. అంతకన్నా ముందు ఇది ఆలోచించండి. ఇస్లాం తలాక్‌ను మానిపించాలని కోరుతోంది. తలాక్‌యే ఎందుకు కావాలి? విభేదాన్ని దూరం చెయ్యండి. ఒకరి లోపాన్ని మరొకరు సహించండి. కోపాన్ని ప్రకటించడానికి తలాక్ పదాన్ని ఆట

బొమ్మగా చేసుకోకండి. ఇక తలాక్‌యే అవదు. అయితే ఇద్దరి భవిష్యత్ జీవిత శ్రేయస్సు విడిపోవడంలోనే వుందని, అన్నివిధాలుగా నిర్ణయమై పోయిన వారికే విడాకులు కావాలి. ఈ లక్ష్యంతో విడాకులు ఇవ్వబడి నప్పుడు కేవలం "ఒకసారి తలాక్" వలన వేర్పాటు జరిగిపోతుంది.

ఈ భావనతో విడాకుల సమస్యను చూడండి. ఇది ఇస్లాం అను యాయుల భావన కనుక మూడు తలాక్‌లను ఒకటి లేక మూడుగా చేస్తున్న వాదన వ్యర్థమైపోతుంది కాబట్టి.

ఒక తలాక్ ఇప్పుడే కాదు మరియు మూడు తలాక్‌లు ఎప్పటికీ కాదు అని నిర్ణయించుకోండి.

మూడు తలాక్‌ల తర్వాత

తలాక్‌ను ఎక్కడ ఎప్పటికోసం ఇస్లాం వుంచిందో మీరు చదివి, అర్థం చేసుకున్నట్లుగా అక్కడ కేవలం ఒక్క తలాక్‌తో ఉద్దేశ్యం నెరవేరు తుంది. ఒక తలాక్ తర్వాత చేయవలసిన దానిని గురించిన ఆదేశం ఇంతకు ముందు వ్రాయబడింది. ఒకవేళ ఎప్పుడయినా రెండవ తలాక్ ఇవ్వ వలసి వస్తే లేక ఎవరైనా ఒకటికి బదులు రెండు తలాక్‌లు ఇచ్చివేస్తే రెండు సందర్భాలలోనూ రెండు తలాక్‌లు కూడా ఒక తలాక్ ఆదేశం వంటిదే. మూడు తలాక్‌లు అవి మూడుసార్లుగా ఇవ్వబడినా లేక ఒకేసారి ఇవ్వబడినా దాని అర్థం ఇద్దరూ శాశ్వతంగావేరయినట్లే. అందుచేతనే దీనిపేరు ముగల్లిజ (కఠినతరమైనది). మూడు తలాక్‌ల తర్వాత తిరిగి కలుసుకునే మార్గం అన్వేషించడం అతినీచమయిన తెలివిమాలిన తనం.

ఈ అవకాశం కోసం దివ్యఖుర్ఆన్ ఒక మాట చెప్పింది.దాని వివరణ హదీసుషరీఫ్‌లో దైవప్రవక్త(స) సెలవిచ్చారు: అదేమంటే ఎవ రయినా భార్యాభర్తల మధ్య మూడు తలాక్‌లు అయిపోయినట్లయితే ఆ తర్వాత ఆ స్త్రీ వివాహం మరొక పురుషునితోఅవుతుంది. తిరిగి ఏదో

కారణంచేత ఈ రెండవ భర్త నుండి వేరవుతుంది. రెండవ భర్త సజీవంగా వుండకపోయినా లేక అక్కడి నుండి ఏదయినా జాయిజ్, ప్రాతిపదికన విడాకులు అయిపోయి, ఇద్దత్ గడిచిన తర్వాత అప్పడు ఈ స్త్రీ మరో మూడవభర్తను వివాహం చేసుకుంటుంది. ఈ సందర్భంగా ఆ మూడవ భర్త గత మొదటి భర్త అయినా కావచ్చు. కేవలం ఈ మార్గాన్నే మూడు తలాక్‌లతర్వాత మొదటి భర్తను తిరిగి వివాహామాడేందుకు దివ్యఖుర్ఆన్ మిగిల్చింది. ఇది యాదృచ్ఛికమయిన మార్గం. అంటే యాదృచ్ఛికంగా స్త్రీ యొక్క రెండవభర్త పోయిన తర్వాత (లేదా అతనితో విడాకులయిన తర్వాత) ఆమె మొదటి భర్తను అయినా చేసుకోవచ్చు. దైవప్రవక్త(స) కాలంలో ఒక మహిళా సహాబియ వుండేవారు. ఆమె ఒక సహాబీహజ్రత్ రిఫాఅ ఖర్జీ భార్య. అతడితో మూడు తలాక్‌లు అయిపోయాయి. ఆమె రెండవ భర్త హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ జుబైర్‌ను వివాహమాడారు. ఆ తర్వాత ఈ వ్యక్తితో శారీరక పరంగా తనకు సామరస్యం కుదరదని భావించారు. ఆమె దైవప్రవక్త(స) దర్బారుకు వచ్చి కొత్త భర్త గురించి షికాయతు చేసింది. దైవప్రవక్త(స) విషయాన్ని గ్రహించారు. నీ మొదటి భర్త రిఫాల ఖర్జీ దగ్గరకు తిరిగి పోదల్చుకున్నావా అని అడిగారు. అలా అయితే మరొక భర్తతో నీకు శారీరక సంపర్కం కలుగనంతవరకూ అక్కడినుండి వేర్పాటు జరగదు. *(తిర్మిజీ, కితాబున్నికాహ్, హదీస్ నం. 1118)*

మూడు తలాక్‌ల తర్వాత మొదటి భర్తనే చేసుకునే అవకాశం, యాదృచ్ఛిక సందర్భం కోసం ఇస్లాం తెరచివుంచింది. మూడు తలాక్‌లు అయిపోయిన తర్వాత అదే భర్తను పునర్వివాహం చేసుకునే ఉద్దేశ్యంతో రెండవ భర్తతో తాత్కాలిక వివాహానికి ప్రణాళికాబద్ధమయిన మార్గం అవలంబించడానికి ఇదేదో ప్రణాళికాబద్ధమయిన విధానం ఎంతమాత్రం కాదుగదా.

ఇస్లాం వంటి పవిత్రధర్మం ఇటువంటి సిగ్గుమాలిన, నీతిబాహ్య

మయిన విధానాన్ని ఎలా సహించగలదు. దైవప్రవక్త (స) ఇటువంటి దారుణమైన విధానాన్ని ఎలా సహించగలదు. దైవప్రవక్త(స) ఇటువంటి దారుణమైన విధానాన్ని అవలంబించే వారికోసం ఎటువంటి షరుష వాక్కును ప్రయోగించారో చూడండి.

దైవప్రవక్త(స) "ధర్మబద్ధం చేసేవాడ్నీ ఎవరికోసం ధర్మబద్ధం చేయ బడిందో వాడ్నీ ఇద్దరినీ శపించారు" *(తిర్మిజీ, కితాబున్నికాహ్, హదీస్: 1120)*

శాపంకన్నా కఠినమైంది ఏముంటుంది? ఇటువంటి విధానాన్ని అవలంబించి దైవం మరియు దైవప్రవక్త(స) చేత శపించబడేందుకు అర్హులు కావటాన్నుండి తప్పించుకోండి.

విడాకులు ఎవరికోసం? స్త్రీకా పురుషునికా?

భార్యాభర్తలిద్దరూ పరస్పరం అంగీకారంతో విడాకుల ద్వారా వేరుపడినప్పుడు, తలాక్ హక్కు ఎవరికుంటుంది అన్న ప్రశ్న అర్థరహితం. ఇస్లాం ఇటువంటి అవకాశం కోసమే తలాక్‌ను సక్రమం చేసింది.

వేర్పాటును ఎవరు పొందాలి? అన్న ప్రశ్నకు సంబంధించినంత వరకూ దాని జవాబు ఇది. ఇస్లాం వేరుపడటానికి అనేకమార్గాలను ఉంచింది. అవి వేర్వేరు సందర్భాల కోసం ఉన్నాయి. ఇందులో వాస్తవానికి భార్యాభర్త లిరువురిలో ఎవరిపైనా దౌర్జన్యం జరుగకూడదన్న మర్మం పనిచేస్తోంది. దౌర్జన్యపీడితుల్ని దౌర్జన్యం నుండి విముక్తుల్ని చెయ్యడానికి వేరుపడటానికి వివిధ మార్గాల్ని ఇస్లాం సూచించింది.

ఈ మార్గాలలో అన్నిటికన్నా మొదటిది, మేలయిన మార్గం తలాక్. ఈ హక్కును ఇస్లాం పురుషునికి ఇచ్చింది. తలాక్ హక్కును పురుషునికి ఇవ్వడంలో ఎన్నో కారణాలు ఉన్నాయి. మొదటి కారణం, గృహం ఒక సంస్థలాంటిది. దానికి పురుషుడ్ని నాయకునిగా చెయ్యటం జరిగింది. ఖుర్‌ఆన్ అంటోంది.

"పురుషులు స్త్రీలపై అధికారులు (ఖవ్వామ్)".

రెండవ కారణం, దాంపత్య జీవితంలో నికాహ్ తర్వాత పురుషునిపై ఇస్లాం రెండు బాధ్యతల్ని మోపుతుంది. ఒకటి భర్త తన భార్యకు మహర్ పేరిట ఒక నిర్ణీత ధనం ఇవ్వాలి. రెండవది, జీవితాంతం భార్యకు ఆహారం, ఖర్చు, వసతి కల్పించాలి. భార్య ఎంత ధనవంతురాలయినా, ఆమె పోషణ బాధ్యత పురుషునికి తప్పనిసరి బాధ్యత. ఈ బాధ్యత స్త్రీపై మోపబడలేదు. ఇటువంటి కారణాలుగా వేరుపడటానికి మొదటి మార్గం అంటే తలాక్ హక్కును పురుషునికి ఇవ్వటం జరిగింది. అయితే ఈహక్కు ఏ సందర్భం కోసం? దాని పద్ధతి ఏమిటి? అన్నదాన్ని గురించి ఇంతకుముందు చదివాం. దైవప్రవక్త(స) సెలవిచ్చారు:

"ఎవరైతే బాధ్యతను స్వీకరించారో వారికే తలాక్ (హక్కు) వుంది."

(ఇబ్నుమాజా, కితాబుత్తలాఖ్: 2081)

వేరుపడటానికి రెండోపద్ధతి తలాఖ్‌ను అప్పగించడం. ఈ పద్ధతి ద్వారా వేరుపడటానికి స్త్రీకి సౌకర్యం కల్పించబడింది. ఇందులో భర్త, తలాక్ హక్కును తన భార్యకు అప్పగిస్తున్నాడు. కాబట్టి నికాహ్ సమయంలో లేక నికాహ్ తర్వాత కూడా భర్త, తలాక్ హక్కును భార్యకు అప్పగించినట్లయితే ఇది తలాక్ అప్పగింత అవుతుంది. భర్తగనక షరతు విధించే హక్కును ఇస్తే షరతు పూర్తయ్యాక భార్య స్వయంగా ఈ హక్కును ఉపయోగించుకుంటూ తనకు తాను తలాక్ ఇవ్వనూగలదు. అది తలాక్ అయిపోతోంది.

వేరుపడటానికి మూడవ మార్గం ఖులా. ఇది కూడా స్త్రీహక్కే. తాను దాంపత్యజీవిత హక్కుల్ని బాధ్యతల్ని నిర్వర్తించలేనన్న అభిప్రాయం ఆమెకు కలిగినప్పుడు ఆమె భర్తనుండి వేరుపడగలదు. భార్య మహర్ ధనాన్ని వాపసు చేస్తుంది. లేక నిర్ణీత ధనం చెల్లిస్తుంది. ఈ ధనానికి బదులుగా భర్త ఆమెకు విడాకులిచ్చేస్తాడు. దీన్ని ఖులా అంటారు. దైవప్రవక్త(స) కాలంలో హబీబ బిన్తె సుహల్ అనే సహాబియా, హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్

దాంపత్యంలో ఉండేవారు. కాని ఆమెకు అక్కడ ఏవిధంగానూ మనసొప్పలేదు. ఆమె దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చి విన్నవించుకున్నారు. "నాకు సాబిత్ పట్ల ఎటువంటి షికాయతూ లేదు ఆయన ధర్మం విషయం లోగానీ, ఆయన వైఖరి గురించిగానీ వ్యవహారణలో నాకెటువంటి ఇబ్బందీలేదు. కాని నేను ఆయన విషయంలో దైవం నిర్ణయించిన ఆదేశా లను పూర్తి చేయలేనేమోనని నాకనిపిస్తోంది. అందుకు దైవప్రవక్త(స) హబీబ బిన్తె సుహల్‌తోఅన్నారు: "మహర్‌గా సాబిత్ నీకిచ్చిన తోటను తిరిగి ఇచ్చెయ్యి" సాబిత్‌తో అన్నారు. "అందుకు బదులుగా నీవు తలాక్ ఇచ్చెయ్యి" ఇదే మొట్టమొదటి ఖులా. ఫిస్ఖ్ (భంగం) వేరుపడటానికి మరో మార్గం ఇస్లామీ న్యాయస్థానం మరియు ముస్లిం ఖాజీ ద్వారా వుంది. భార్యకు భర్తపై ఆరోపణ ఉంది. ఉదాహరణకు అతడు మగతనం లేని వాడు లేక పోషణ ఖర్చు ఇవ్వడు. లేక సరిగ్గా వ్యవహరించడు. లేక భర్త పత్తాలేకుండా పోయాడు. లేక పిచ్చివాడయ్యాడు. లేక అతడేమయినా ప్రాణాంతక వ్యాధికి గురయ్యాడు వగైరా, ఆరోపణలుంటే ఆమె తన కేసును ఖాజీకి సమర్పిస్తుంది. ఖాజీ ఈ వ్యవహారాన్ని పరిశీలించి న్యాయ స్థాన విధులు పూర్తిచేస్తాడు. సంతృప్తి చెందిన తర్వాత ఖాజీ స్వయంగా ఆమె నికాహ్ బంధాన్ని విడదీస్తాడు. (ఫిస్ఖ్) ఆల్ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ద్వారా దేశంలోని అనేక ప్రాంతాల్లో ఖాజీ వ్యవస్థ ఏర్పాటయి వుంది. అక్కడ ముస్లిం ఖాజీ వద్ద ఇటువంటి కేసులు దాఖలు చేయవచ్చు.

ఇద్దత్ గురించి

ఇద్దత్ విషయంలో కొన్నిమాటలు గుర్తుంచుకోండి: ఒక తలాక్ లేదా రెండు తలాక్‌ల తర్వాత ఇద్దత్ (గడువు) వున్న విధంలోనే (దీనిగురించి ఇంతకుముందు ప్రస్తావించబడింది) మూడు తలాక్‌ల తర్వాత ఇద్దత్ వుంటుంది. ఇద్దత్ కాలాన్ని గడపటం అల్లాహ్ ఆదేశం. దివ్యఖుర్‌ఆన్‌లో ఆదేశించబడింది.

"ఇద్దత్‌ను గుర్తుంచుకోండి. తమ ప్రభువుకు భయపడుతూ వుండండి."

(అత్ తలాఖ్: 1)

ఇద్దత్ గడవనిదే స్త్రీకి మరో వివాహం జరుగదు. ఒక తలాక్ లేక రెండు తలాక్‌లను తలాఖె రజయీ అంటారు. ఇద్దత్‌లో భార్యను ఆమె భర్త తిరిగి పొందగలడు, తన భార్యగా చేసుకోగలడు. ఒకవేళ ఇద్దత్ గడిచిపోతే మరోసారి ఆస్త్రీని వివాహం చేసుకోవచ్చు. మూడు తలాక్‌ల తర్వాత ఇద్దత్ కాలంలోగానే ఇద్దత్ గడచిన తర్వాతగానీ ఆ స్త్రీ తిరిగి ఆ భర్తకు భార్యకాజాలదు. అందుకు అవకాశం గల పక్షంలో తప్ప. దీన్ని గురించి మూడు తలాక్‌ల తర్వాత అన్న ఆదేశాలలో చెప్పబడినట్లుగా.

ఇద్దత్ కాలాన్ని పురుషుని ఇంటిలోనే గడపాలి. ఆ వ్యవధి కాలంలో భార్య పోషణ కూడా భర్తే చెయ్యాలి. ఇద్దత్ ముగిసిన తర్వాత ఆ స్త్రీ పురుషుల మధ్య ఎటువంటి సంబంధమూ మిగిలి ఉండదు. కనుక ఇక ఆ స్త్రీ పోషణ బాధ్యత పురుషునిపై లేదు. ఇద్దత్ తర్వాత కాలానికి పురుషుని నుండి పోషణ ఖర్చు తీసుకోవడం అంటే అపరిచిత/ పరాయి పురుషుని నుండి పోషణ ఖర్చు తీసుకోవడమే.

ఇద్దత్ కాలం బహిష్టు గల స్త్రీల కోసం మూడు బహిస్టులు. మూడవ బహిస్టు నుండి పవిత్ర అయిన వెంటనే ఇద్దత్ ముగిసిపోతుంది. ఒకవేళ బహిష్టు రాకపోతే మూడు నెలల ఇద్దత్‌కు గడువు వుంటుంది. కాని విడాకుల సమయంలో స్త్రీ గర్భం ధరించి వుంటే కాన్పు జరిగిన వెంటనే ఇద్దత్ ముగుస్తుంది. కాన్పు విడాకులివ్వబడిన కొద్దికాలం తర్వాతే జరిగినా లేక మూడునెలలకన్నా ఎక్కువ కాలంలో కాన్పు జరిగినా సరే.

- : సమాప్తం : -